క్లుప్తంగా

అగ్ని ప్రమాద బాధితులకు వితరణ



బాధితురాలికి వంట సామాగ్రి అందిస్తున్న రెడ్‌క్రాస్ కార్యకర్తలు, నాయకులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పెద బూరాడపేట గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు రెడ్‌క్రాస్ సొసైటీ కార్యకర్తలు సోమవారం వంట సామాగ్రి అందజేశారు. బాధితులు సారిపల్లి బుల్లమ్మ, ముంత పోలిపల్లికు సామాన్లు అందజేస్తూ భరోసా కల్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ కార్యకర్త సత్యనారాయణ, నాయకులు మక్కువ వెంకటరమణ, బెల్లాన రామారావు, మక్కువ రమణ, నారాయణరావు, పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ క్యాంప్ పరిశీలన



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి రమణకుమారి

భోగాపురం: పోలిపల్లి రెవెన్యూ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీలో నిర్వాసితుల కోసం నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరాన్ని జిల్లా వైద్యాధికారి రమణకుమారి సోమవారం పరిశీలించారు. నిర్వాసితులకు ఎటువంటి రోగాలు దరి చేరకుండా వారం రోజుల పాటు వైద్యశిబిరాన్ని కొనసాగించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిస్వామిని ఆదేశించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

అప్రెంటిస్ మేళాకు స్పందన



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో సోమవారం నిర్వహించిన అప్రెంటిస్ మేళాకు విశేష స్పందన లభించింది. పది కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరై నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 104 మంది నిరుద్యోగులు అప్రంటీస్ మేళాకు హాజరు 38 మందిని ఎంపిక చేసినట్లు జిల్లా కన్వీనర్, విజయనగరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ తెలిపారు.

బైజూస్ ట్యాబ్స్ వినియోగించాలి

• ఎంఈఓ శ్రీదేవి



నీలకంఠరాజపురం హైస్కూల్‌లో బైజూస్ ట్యాబ్ వినియోగంపై విద్యార్థినిని ఆరా తీస్తున్న ఎంఈఓ శ్రీదేవి

వేపాడ: ఎనిమిదో తరగతి విద్యార్థులు బైజూస్ టాబ్స్ ప్రతిరోజూ వినియోగించేలా చూడాలని ఉపాధ్యాయులకు ఎంఈఓ జి.శ్రీదేవి సూచించారు. నీలంకంతరాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సోంవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా బైజూస్ ట్యాబ్ వినియోగంపై ఆరా తీశారు. ఎస్‌సీఈఆర్‌డీఏపీ రూపొందించిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలన్నారు. విద్యార్థులచే నోట్స్ రాయించడం, వాటిని పరిశీలించడం చేయాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

ఇంటింటికీ పుస్తకాల పంపిణీ



చీపురుపల్లిలో పాఠకుడికి పుస్తకాలు అందజేస్తున్న ఆశయ సంస్థ ప్రతినిధులు

చీపురుపల్లి: పట్టణానికి చెందిన ఆశయ రూరల్ లైబ్రరీ ఆధ్వర్యంలో ఇంటింటికీ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ సోమవారం ప్రారంభించారు. చీపురుపల్లితో పాటు పరిసర గ్రామాలకు చెందిన పాఠకులు తమ సంస్థకు ఫోన్ చేస్తే మొబైల్ లైబ్రరీ ద్వారా వారికి నీతి కథలు, చరిత్ర తదితర పుస్తకాలను ఉచితంగా అందజేస్తున్నామని చెప్పారు. నెల రోజుల పాటు పుస్తకాలు చదువుకుని తిరిగి సంస్థకు అందించాల్సి ఉంటుందని తెలిపారు. సెల్‌ఫోన్ల ప్రభావం విపరీతంగా పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో విద్యార్థులు, యువతను దానిని నుంచి దూరం చేసి తిరిగి పుస్తక పఠనం వైపు మళ్లించేలా చేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ జాయింట్ సెక్రటరీ ఎస్.వి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

• జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య



ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్యను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయనగరం అర్బన్: మహిళలందరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య అన్నారు. జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక జేఎన్‌టీయూ జీవీ యూనివర్సిటీ ప్రాంగణంలో 'విమెన్ ఎంపవర్‌మెంట్ అండ్ గ్రీవెన్స్ సెల్, డైరెక్టరేట్ ఆఫ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ విమెన్ అండ్ గ్రీవిన్స్‌సెల్' ఆధ్వర్యంలో 'సైబర్ ఇంటలిజెన్స్ అండ్ సెక్యూరిటీ' అనే అంశంపై జరిగిన ఫాకల్టీ డవలప్‌మెంట్ ప్రొగ్రామ్‌కి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దే అవకాశం మహిళకే ఉంటుందని, ఆమె తలంచుకుంటే ఏదైనా సాధించగలదన్నారు. సైబర్ మోసాల పట్ల మహిళలు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం నిర్వాహకులు ముఖ్య అతిథిని సత్కరించారు. గ్రీవెన్స్‌సెల్ కన్వీనర్ ప్రొఫెసర్ జి.జయసుమ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు, డిస్ట్రిక్ట్ లీగల్ కౌన్సెలర్ జి.మాధవి, యూనివర్సిటీ డైరెక్టర్లు ప్రొఫెసర్ కె.బాబులు, ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, ప్రొఫెసర్ రాజేశ్వరరావు, ప్రొఫెసర్ కేసీబీ రావు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.గురునాథ్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వీఎస్ వకుళ, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ పి.అరుణకుమారి, ఆంధ్ర యూనివర్సిటీ సీఎస్ఈ విభాగం ప్రొఫెసర్ వి.వల్లీకుమారి, ఎస్సైలు లక్ష్మణరావు, కేటీఆర్ లక్ష్మి, ఫ్యాకల్టీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీఓ బంగార్రాజు, వెంకటరావు

విజయనగరం రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అమల్లోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి నియోజకవర్గంలో పటిష్టంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు, ఎంపీడీఓ గంటా వెంకటరావు ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల శాఖ అధికారులతో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కలెక్టర్ ఆదేశాల మేరకు నియోజకవర్గ పరిధిలో ఉన్న కార్పొరేషన్, మండలంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి కచ్ఛితంగా అమలు చేయాలన్నారు. నియమావళి ఉల్లంఘించిన వారిపై చర్యలకు సిఫార్సు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి డి.తిరుపతినాయుడు, సీఎస్‌డీటీ జగన్నాథం, డీటీలు, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో పాటు విలువలు



ప్రొఫెసర్ రంజన్ కుమార్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

• ఐఐటీ పాట్నా ప్రొఫెసర్ రంజన్‌కుమార్

విజయనగరం అర్బన్: సాంకేతిక విద్యలో ప్రతిభ చూపించడంతో పాటు నైతికత, మానవీయత వంటి విలువలు అలవరుచుకోవాలని ఐఐటీ పాట్నా ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ రంజన్‌కుమార్ అన్నారు. స్థానిక గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగు రోజులుగా జరుగుతున్న వివిధ ప్రాంతాల ప్రొఫెసర్ల సదస్సు సోమవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చదువు పూర్తయిన తర్వాత స్థిరపడాల్సిన రంగంలో ప్రతిభతో పాటు జీవితంపై సమగ్ర అవగాహన ఉన్నపుడే విద్యార్థులు ఆనందమయ జీవితం గడపగలుగుతారన్నారు. అనంతరం నిర్వాహకులు ముఖ్య అతిథిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీడీవీఏ నాయుడు, డీన్ రీసెర్చ్ డాక్టర్ నరేంద్ర, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర వేణుమాధవరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సరోజినీనాయుడు జీవితం ఆదర్శనీయం



సరోజినీనాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

లక్కవరపుకోట: భారత కోకిల (నైటింగేల్ ఆఫ్ ఇండియా),స్వాతంత్ర్య సమరయోధురాలు సరోజినీనాయుడు జీవితం మహిళాలోకానికి ఆదర్శప్రాయమని మహాత్మ జ్యోతిరావుపూలే బాలికల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ యు. విజయ్‌కుమార్ పాత్రో అన్నారు. జమ్మాదేవిపేట గ్రామం సమీపంలోని ఆశ్రమ పాఠశాలలో సరోజినీనాయుడు జయింతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సరోజినీనాయుడు ప్రసిద్ధిగాంచిన కవయిత్రి అని విదేశాల్లో ఉన్నత చదువులు చదివారని, స్వాతంత్ర్యం ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. దేశంలో మొట్టమొదటి మహిళా గవర్నర్‌గా కూడా ఆమె పనిచేశారని వివరించారు.

ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం

బొండపల్లి: ప్రతిరోజూ క్రమం తప్పకుండా ధ్యానం చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని బ్రహ్మర్షి ప్రేమ్‌నాథ్ అన్నారు. మండలంలోని గొట్లాంలో గల షిర్డీసాయి ఆలయంలో ధాన్యంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ క్రమంతప్పకుండా ధ్యానం చేయాలన్నారు. ఇంటి ఆవరణంలో సేంద్రియ పద్ధతిలో కూరగాయలను సాగుచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పిరమిడ్ జిల్లా సేవాదళ్ వి.రామకృష్ణం రాజు యోగా సాధకులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు ప్రత్యేక క్యాంపెయిన్



అనంతగిరి జూనియర్ కళాశాలలో క్యాంపెయిన్ నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల అధ్యాపకులు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు నేతృత్వంలో సోమవారం ప్రత్యేక క్యాంపెయిన్ ప్రారంభించారు. డిగ్రీ కళాశాల అధ్యాపకులు విశాఖపట్నం జిల్లాలోని అనంతగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లి అక్కడ సీనియర్ ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సౌకర్యాలు, వసతుల గురించి వివరించారు. కళాశాలలో చేరి ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, డిజిటల్-వర్చ్యువల్ క్లాసులు, మోడ్రన్ జిమ్, డిజిటల్ లైబ్రరీ, జేకేసీ వంటి వసతులు, సౌకర్యాలను ఉపయోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల ఉపన్యాసకులు జి.ఈరన్న, సీహెచ్.శ్రీనివాసరావు, వలీఖాన్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల పీఎస్‌ను తనిఖీ చేసిన డీఐజీ

నెల్లిమర్ల: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను విశాఖపట్నం రేంజ్ డీఐజీ ఎస్. హరికృష్ణ సోమవారం సందర్శించారు. స్టేషన్‌కు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. డీఐజీ వెంట విజయనగరం ఇన్‌చార్జ్ డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు, భోగాపురం సీఐ విజయనాథ్ ఉన్నారు.

రోగులతో ప్రేమగా మాట్లాడండి

విజయనగరం ఫోర్ట్: రోగులతో ప్రేమగా మాట్లాడాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలీల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సమావేశ మందిరంలో వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆస్పత్రికి ఏ సమయంలో రోగులు వచ్చినా వారి పరిస్థితిని బంధువులకు వివరించాలన్నారు. ఏ సందర్భంలో కూడా రోగులు, వారి సహాయకులపై కోపం , చిరాకు ప్రదర్శించవద్దని సూచించారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బొత్స సంతోష్, ఆర్ఎంఓ డాక్టర్ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై కేసు నమోదు

భోగాపురం: మండలంలోని ముంజేరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పిగుడు. నాగరాజు(చందు), దారపురెడ్డి మధుసూదనరావు (మధు)లపై కేసు నమోదైంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఈనెల 11న తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మండలం సర్వేయర్ మాత మధుకేశ్వరరావు ముంజేరు రెవెన్యూ పరిధి స్వాతి లేఅవుట్‌లో కొన్ని సర్వే నంబర్లకు సంబంధించి భూములను సర్వే చేస్తుండగా.. పిగుడు నాగరాజు, దారపురెడ్డి మధుసూదనరావు సర్వేను అడ్డుకుని అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో సర్వేయర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కిశోర్‌కుమార్

గజపతినగరం రూరల్: మండలంలోని దావాలపేట గ్రామంలోని వంక చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ కె.కిశోర్‌కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వేతనదారులతో మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు గరిష్ట వేతనం రూ.250 అందుతుందని అన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తామని తెలిపారు. ఆయన వెంట ఏపీఓ సీహెచ్.రామారావు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.50వేల విరాళం



ఆలయ కమిటీకి నగదు అందజేస్తున్న దాత సరయ్యశెట్టి

కొత్తవలస: కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధి డ్రైవర్స్ కాలనీలోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయ అభివృద్ధికి మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ మామిడి సరయ్యశెట్టి తన నివాసంలో రూ.50వేల విరాళం ఆలయ కమిటీకి సోమవారం అందజేశారు. దాతకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రూ. 2 లక్షలతో సీసీ రోడ్డు

వేపాడ: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు సుమారు 60 మీటర్ల మేర సీసీ రోడ్డును రెండు లక్షల రూపాయలతో వేయనున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నిధులు మంజూరు కాగా పనులు ప్రారంభించినట్లు సర్పంచ్ మిరపాక అర్జునమ్మ తెలిపారు.

ప్రజలందరిపై లయకారుడి ఆశీస్సులు

• నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



సర్వాంగ సుందరంగా అలంకరించిన మహాశివలింగాలు

విజయనగరం టౌన్: లయకారుడైన పరమశివుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపైనా ఉండాలని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఆకాంక్షించారు. ఈ నెల 18న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో టౌన్ సెంటర్ లేఅవుట్‌లో ఉన్న సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మహాశివరాత్రి ఉత్సవాలలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సనాతన సంప్రదాయాలను కాపాడుతూ, భావితరాలకు తెలియజెప్పే విధంగా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అజ్ఞానమనే చీకటి నుంచి ప్రతి ఒక్కరికీ పరమశివుడు జ్ఞానజ్యోతిని ప్రసాదించాలన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థ నిర్వాహకురాలు అన్నపూర్ణ శివరాత్రి ప్రాశస్త్యాన్ని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కనకల సుజాతతో పాటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు ఏర్పాట్లు



నడిపల్లిలోని చంపావతి నది పరీవాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎన్‌జీఆర్ఐ సైంటిస్ట్

భోగాపురం/పూసపాటిరేగ: భోగాపురం మండలంలో నిర్మించనున్న విమానాశ్రయానికి మంచినీరు సరఫరాకు చేసేందుకు పూసపాటిరేగ మండలంలోని పాత నడిపిల్లి, కొప్పెర్ల, భోగాపురం మండలంలోని నందిగాం తీర ప్రాంతంలో ఉన్న చంపావతి నదిని ఎన్‌జీఆర్ఐ సైంటిస్ట్ డి.మురళీధరన్ సోమ వారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విమానాశ్రయానికి మంచి నీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. విమానాశ్రయానికి ఒక రోజుకు 5 మీలియన్ల నీరు అవసరముంటుదని, ఈ మేరకు పూసపాటిరేగ మండలంలోని పాత నడిపిల్లి, కొప్పెర్ల, భోగాపురం మండలంలోని నందిగాం ప్రాంతం నుంచి చంపావతి నీరు తరలించేందుకు సాధ్యాసాధ్యాలపై పరిశీలన చేస్తున్నట్లు చెప్పారు. అలాగే సముద్ర తీర ప్రాంతాలకు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆదేశాల మేరకు జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకర్, ఈఈ ఏపీఎస్ రాజన్, ఏఈ హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

ఖజానా శాఖాధికారి గణేష్‌కు నివాళులు



ఖజానా శాఖాధికారి గణేష్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది

విజయనగరం అర్బన్: జిల్లా ఖజానా శాఖాధికారి ఎస్ఆర్‌కే గణేష్ మృతి ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక ఖజానా శాఖ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఖజానాశాఖ డీడీ ఆర్ఏ సమర్పణకుమార్, ఏటీఓలు నితిన్‌జోషి, ఆదిత్యసింగ్, సిబ్బంది పద్మనాభం, ఆదినారాయణ, రామరాజు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరంలో 'ఫ్యామిలీ డాక్టర్'



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ సాయికృష్ణారెడ్డి

గజపతినగరం: స్థానిక గ్రామ సచివాలయం-1 పరిధిలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సచివాలయం వద్ద శిబిరం ఏర్పాటు చేసి ఓపీ(అవుట్ పేషెంట్) సేవలందించారు. 65 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యంపై ఆరా తీసి, వృద్ధులు, గర్భిణులు, బాలింతలకు వైద్యతనిఖీలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలను సందర్శించి పిల్లలకు వైద్యపరీక్షలు చేశారు. ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. మరుపల్లి పీహెచ్‌సీ,104 వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫేస్‌యాప్ నుంచి మినహాయింపు ఇవ్వాలి



తహసీల్దార్ కృష్ణంరాజుకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

వేపాడ: ఫేస్ యాప్ (ముఖ ఆధారిత హాజరు) నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని వీఆర్ఏలు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కృష్ణంరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘ మండల నాయకులు గట్టు వెంకన్న, అప్పారావు, సూర్యనారాయణ, గురువులు, తదితరులు మాట్లాడుతూ, సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 14న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నవధాన్యాల సాగుతో భూమి సారవంతం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

దత్తిరాజేరు: నవధాన్యాల సాగుతో భూమి సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి కాసులమ్మ అన్నారు. నవధాన్యాల సాగుపై మండలంలోని వింధ్యవాసి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సోమవారం రైతులు, ఉపాధి వేతనదారులు, పొదుపు సంఘాల మహిళలతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాసులమ్మ మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలకు గ్రామ సమాఖ్య ద్వారా నవధాన్యాల విత్తనాలు ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. నవధాన్యాల సాగు చేసిన పొలాల్లో తర్వాత వేసే ప్రధాన పంటలకు రసాయన ఎరువులను వినియోగించాల్సిన అవసరం ఉండదని, పెట్టుబడి ఆదా అవుతుందని అన్నారు.